# నాటి వ్యామోహం

సెలవులయి కాలేజీ తెరవగానే ఈ వార్త ఒక్కసారిగా కాలేజీ అంతటా గుప్పుమంది... అప్పుడే ఈ సంగతి అందరికీ తెలిసింది.... అందరూ విడ్డూరంగా చెప్పుకునే వాళ్ళే! "మాలతి ఎంత చిత్రమైన మనిషి" అని నేనూ ఆశ్చర్యపోయాను.

* * *

కాలేజీలో చేరింది మొదలు ఆడ పిల్లల్లో మాలతికీ, మగ పిల్లల్లో దామోదరానికీ ఒక్క క్షణం పడేదికాదు. ఇద్దరి మధ్యా పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనేది — ఇద్దరూ ముఖాముఖీ ఎప్పుడూ పోట్లాడుకోలేదు. కాని ఒకర్ని చూస్తే ఒకరికి చెప్పలేని ద్వేషం ఓర్వలేనితనం ఉండేవి...మాలతి సహజంగానే ఆకర్షణ గల వ్యక్తి — తండ్రికి ఉన్న ఐశ్వర్యానికి తోడు ఆమెకు జన్మతః వచ్చిన సౌందర్యం, చదువులో ఆమె కనపరిచే తెలివి ఆమెకు మంచి అలంకారా లయినాయి. ఎప్పుడూ ఉత్సాహంగా నవ్వుల వెన్నెలలు కురిపించే ఆమె ముఖంలో తేజస్సు ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తుంది. ఆమెను చూడగానే ఆమెలో ఏదో సమ్మోహన శక్తి ఉందని పిస్తుంది.... వెయ్యి మందిలో నిల్చున్నా సరే మాలతిని చూసి "ఆ అమ్మాయి ఎవరు?" అని అడగాలని పిస్తుంది. అంతటి ఆకర్షణీయమైన మూర్తి ఆమెది. ఆమె అంటే కాలేజీలో అందరికీ గౌరవం. అటువంటి మాలతిని చూసి దామోదరానికి ద్వేషం... కాలేజీలో చేరిన మొదటి రోజుల్లో మాలతి దామోదరం అంటే హడలి పోయేది... మాలతి ఏ పని చేస్తున్నా సరే ఎలాగో దామోదరం కంట పడేది. ఇక అది జ్ఞాపకముంచుకొని అందరం రోడ్డు మీద నడిచే టప్పుడో మేము క్లాసులోంచి లేడీస్ రూములోకి వెళ్ళేటప్పుడో క్లాసులో ప్రొఫెసర్ లేనప్పుడో తన మిత్ర బృందాన్ని చుట్టూ చేర్చుకుని వేళాకోళాలు, వెక్కిరింతలు ప్రారంభించేవాడు దామోదరం—

రోజూ సాయంత్రం ఇంటి దగ్గర మాలతికి పినతండ్రి సైకిలు నేర్పేవాడు. ఒక రోజు ఆయన మామూలుగా ఆమెను సైకిలు ఎక్కించి కొంత దూరం వెంట వెళ్ళి తరువాత బేలెన్స్ సరి చూసుకొని ఆమెను ఒకదాన్ని వదిలేశాడు. సైకిలు చాలా దూరం విసురుగా వెళ్ళిపోయింది. అక్కడ ఆపడానికి బ్రేక్ వెయ్యడం ఆమెకు చేతకాలేదు. సైకిలు రోడ్డు పక్కకు తిరిగిపోయి ఒక చెట్టుకు డాష్ ఇచ్చి పడిపోయింది.... ఆ 'సీను' కాస్తా దామోదరం కంట పడింది.... అప్పుడే కొత్తగా 'ముగ్గురు మరాఠీలు' విడుదలై ఊళ్ళో ఆడుతోంది. అందులో పాట జ్ఞాపకముంచుకుని మర్నాడు కాలేజీలో "రాలిపోతివా మాలతీ!" అంటూ రాగాలు ప్రారంభించాడు దామోదరం. కాలేజీలో ఒకసారి స్వాతంత్ర్యదినోత్సవానికి ఫ్లాగ్ హోయిస్టు చేయించినప్పుడు మాలతి చేత పాట పాడించాడు ప్రిన్సిపాల్. ఆమె పాడుతుండగా మగ పిల్లల చాటునుంచి "ఆహా! కనన్ బాల కంఠం ఎరువు తెచ్చుకుందిరా! లేకపోతే ఈవిడగారికి ఇంత మంచి కంఠం ఎక్కడిది!" అని అరిచాడు దామోదరం.

మొదట్లో దామోదరాన్ని చూసి మాలతి చాలా భయపడేది.... ఒక రోజున కాలేజీలో బాట్‌మింటన్ ఆడి ఆడపిల్ల లందరం ఆలస్యంగా బయలుదేరి ఇంటికి నడిచి వెళ్ళుతున్నాం.... జామపండ్ల తట్టతో ఒక అమ్మి మాకు ఎదురయింది. దగ్గరికి వచ్చి "పళ్ళు కొంటారా అమ్మా!" అని అడిగింది... తట్ట దింపించి నేను, మాలతి, ఇందిర, సరోజ పళ్ళు కొన్నాం. ఆ అమ్మి వెళ్ళిపోయింది.... అప్పటికి స్టూడెంట్స్ అందరూ

శ్రీమతి వి. ప్రభావతి

వెళ్ళిపోయుంటారనీ రోడ్డు మీద ఎవరూ లేరుకదా అని హాయిగా కబుర్లు చెప్పుకుంటూ పళ్ళు తింటున్నాము. మాలతి కూడా పండు తీసుకుని అప్పుడే తినబోతోంది. ఇంతలో దూరంగా సైకిలు మీద దామోదరం కనిపించాడు "అడుగో మాలతీ దామోదరం!" అన్నాను — అంతే హడలి పోయి తినబోతున్న జామపండు కాస్తా జారవిడిచేసింది మాలతి. అప్పటికే మాకు బాగా దగ్గర వచ్చేశాడు అతను — "అందని పండ్లకోసం అర్రులు చాచటం వెర్రితన మన్నారు పెద్దలు — అందిన పండును కూడా ఆరగించ లేకపోవటాన్ని ఏమనాలో మరి!" అంటూ మమ్మల్ని దాటి రివ్వున సైకిలు మీద వెళ్ళిపోయాడు.... అసలు ఆ పళ్ళ అమ్మిని పంపింది కూడా దామోదరమే నన్న సంగతి తరువాత తెలిసింది మాకు!

మరోకసారి — సాయంకాలం కాలేజీ వదలగానే ఆడపిల్లలం అందరం కలిసి ఇంటికి బయలుదేరాం — కాలేజీ బస్సు అప్పటికే వచ్చి సిద్ధంగా వుంది — కాని నడిచి వెళ్ళాలనే సరదా కొద్దీ ఎవరమూ బస్సు ఎక్కలేదు.... కొంతదూరం వెళ్ళేసరికి వెనకనించి కాలేజీ బస్సు వేగంగా వచ్చింది — మా దగ్గరికి రాగానే బస్సు స్లో చేశాడు డ్రైవర్ — బస్సు మమ్మల్ని దాటుతూండగా ఫుట్‌బోర్డు మీద నిలుచున్న దామోదరం మా వేపు తిరిగి కెమేరా క్లిక్ చేశాడు. అంతే—బస్సు మళ్ళీ మామూలు వేగంతో వెళ్ళిపోయింది. కళ్ళు మూసి తెరిచే లోపల అంతా జరిగి పోయింది...మర్నాడు క్లాసులో అతను "కనక్ దేవి ప్రొఫైలుందిరా నా దగ్గర మీ కెవరికైనా కావాలా? కనక్‌దేవి ఫ్రంట్ వ్యూకంటె ప్రొఫైల్ చాలా బాగుంటుంది గదరా?" అని వాగుడు ప్రారంభించాడు....

ఆ రోజు క్లాస్ విడిచి వచ్చేసాక మాలతికి కళ్ళనీళ్ళు పర్యంతం అయింది.; దామోదరం చేసిన పనికి చాలా బాధపడింది.

"చూడు సావిత్రీ! 'ఇతని' వ్యవహారం మరీ మితిమీరి పోతోంది — నాకేం చెయ్యాలో తోచటం లేదు" అన్నది మాలతి...నే నేమీ సమాధానం చెప్పలేదు.

"నా ఫోటోలు 'అతని' దగ్గర ఉన్నాయనే సంగతి పెద్ద వాళ్ళెవరికైనా తెలిస్తే ఏ మనుకుంటారు చెప్పు సావిత్రీ!" అన్నది మాలతి భయంతో. "పోనీలే మాలతీ! దానికి అంత భయపడుతా వెందుకు?... అవి అతని పుస్తకాల బీరువాలో దాచుకుని రోజూ కర్పూర హారతి వెలిగిస్తాడు— మంచిదేగా!" అన్నాను నవ్వుతూ.

"ఛీ! ఊరుకో సావిత్రీ—నువ్వు మరీను... అతను ఒట్టి పోకిరి వాడు — పొగరు మోతు—రౌడీ!" అన్నది మాలతి రోషంతో.

"అతను నిజంగా పోకిరీవాడే అయితే మిగతా ఆడ పిల్లల జోలికి పోడేం?...అతనికి ఒక వేళ నీ మీద—"

"సావిత్రీ!" — అరిచింది మాలతి కోపం పట్టలేక... ఇక నేను మళ్ళీ ఆ ప్రస్తావన తేలేదు.

కాలేజీ జీవితంలో సంవత్సరాలు మారినా దామోదరం ప్రవర్తనలో మాత్రం మార్పు రాలేదు....మాలతి అంటే అతనికి ఉన్న అలుసు నానాటికీ పెరుగుతూనే ఉంది ఒకసారి దామోదరం స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా నిలబడ్డాడు. మాలతి తన ఓటు అతనికి వెయ్యలేదు. అంతేకాదు. మా అందరి చేతా కూడా బాయ్‌కాట్ చేయించింది. లేడీస్ అందరూ అతనికి వ్యతిరేకం!—అయినా అతను ఓడిపోలేదు, గెలిచాడు.... తరువాత తెలుగు ఎసోసియేషన్ మీటింగులో ఎసోసియేషన్ ప్రెసిడెంట్‌ను లేడీస్‌లోంచి ఎన్నుకోమన్నారు ప్రొఫెసర్ — వెంటనే దామోదరం లేచి నుంచుని "ఐ ప్రపోజ్ మాలతి" అన్నాడు నేపో

లియన్ పోజుపెట్టి. వెంటనే ప్రక్కనే ఉన్న అతని స్నేహితుడు ఒకతను స్ప్రింగ్ బొమ్మలా లేచినుంచుని "ఐ సెకెండ్ ది ప్రపోజల్" అన్నాడు—అతని స్నేహితు లంతా కూడా అతన్ని బలపరుస్తూ హర్షధ్వానాలు చేశారు.... అనుకోకుండా మాలతి ఏకగ్రీవంగా ఎన్నిక అయింది. ప్రొఫెసర్ లోలోపల నవ్వుకున్నాడు. మేము అందరం ఆశ్చర్యపోయాం.

కాని మాలతిమాత్రం— తనను ముందుగా అడగకుండా తనను చులకన చెయ్యటానికే—ఇలా తనపేరు ప్రపోజ్ చేశాడని దామోదరంమీదా, అతని ఔదార్యాన్ని మెచ్చుకున్నానని నామీద కోపంవచ్చుకుంది— అతను తన దురుసుతనాన్ని ఈ విధంగా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూకూడా ఆమెమీద ప్రయోగిస్తూనే ఉన్నాడు. దామోదరం ఇంత విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నాడని తెలిసికూడా ప్రిన్సిపాల్ ఏమీ పట్టించుకునేవాడు కాదు— కారణం అతను చదువులో ఏమీ అశ్రద్ధ కనపరచేవాడుకాదు. ప్రతి సబ్జెక్ట్‌లోను ఫస్టు మార్కు అతనిదే. ప్రతి కాంపిటీషనులోను ఫస్టుప్రైజు అతనిదే—ప్రొఫెసర్లకూ ప్రిన్సిపాల్‌కూ కూడా అతను నెత్తిమీద దేవత!— ప్రిన్సిపాల్‌కూడా ఏమీ కలగజేసుకోకపోవటం చూసి మాలతికి మరింత రోషం హెచ్చిపోతోంది... క్రమంగా దామోదరం అంటే భయంపోయి ఆమెలో ప్రతీకారవాంఛ బయలుదేరింది. అప్పటికి కాలేజీచదువు ఇంకా ఒకసంవత్సరంవుంది— అందరం అనర్సు ఫైనల్‌లోకి వస్తాము— "ఇహ ఒక్కసంవత్సరం కళ్ళు మూసుకుంటే ఈ దామిగాడి పీడ వదులుతుంది నాకు—వీ డెక్కడ దాపురించాడో నా ప్రాణానికి!" అనేది మాలతి.

మాలతికోపం క్రమంగా క్రియారూపం దాల్చింది ఒకరోజున దామోదరం స్కైకలర్ బుష్‌కోటు క్రొత్తగా కొనుక్కున్నాడు! తెల్లటిపేంటు తొడుక్కుని వచ్చాడు కాలేజీకి... అతను లేడీస్‌రూమ్ ముందుగా వెళ్ళేసమయంచూసి వెనకనుంచి—ఎర్రసిరా పెన్ పాళి తీసి అతని బుష్‌కోట్‌మీద విదిలించింది మాలతి... ఇక ఆరోజంతా దామోదరాన్ని క్లాసులో తలెత్తుకోటానికి వీల్లేకుండా చేశారు అతని స్నేహితులు—

"బుష్‌కోటుమీద ముద్రలు భేషుగ్గా ఉన్నాయిరా నాన్నా! ఎక్కడో వసంతోత్సవానికి వెళ్ళొచ్చినట్టున్నావే ఏమిటి గిరాకీ?" అని ఒకరూ, "మొన్ననే కొత్తగా కొనుక్కున్నాడురా పాపం—ఆ స్కైకలర్ బుష్‌కోటూ ఆ తెల్లపేంటూను—ఆ డ్రెస్‌లో వాణ్ణి చూసి ఓర్వలేక ఎవరో ఈపని చేసుంటారు," అని ఇంకొకరూ "ఒరే నాన్నా! దామూ! అసలు— వసంతం మగవాడిమీద ఎప్పుడు చల్లుతారో ఎందుకు చల్లుతారో నీకు తెలుసునా?" అని కొందరూ— ఈ విధంగా అతన్ని ఆ రోజంతా ఏడిపించేశారు...దామోదరం కోపంతో లోలోపల ఉడికిపోయాడు. కాని ఆగ్రహం అణిచిపెట్టుకుని ఏమీ జరగనట్టుగా మామూలుగా ఉండటానికే ప్రయత్నించాడు...చివరికి ఎలా సాధించాడో గాని— ఆ రోజున ఓర్వలేనిపని చేసిన ధీరురాలు మాలతేనని సంగతి తెలుసుకున్నాడు—అది మనస్సులో ఉంచుకొని మళ్ళీ సమయంకోసం ఎదురుచూస్తున్నాడు—



దామోదరం కెమెరా క్లిక్ చేశాడు

మాలతి ఆ రోజున ఆ పని చేసిందన్నమాటేకాని అంతమాత్రాన ఆమెకు దామోదరంమీద కోపం చల్లారలేదు... ఇద్దరి మనస్సుల్లోను ఉన్న క్రోధం క్రమంగా పెరిగితారస్థాయిని అందుకుంటోంది. ఇద్దరూ తలవనితలంపుగా ఎక్కడయినా ఒక్కసారి ఒంటరిగా తారసిల్లి ముఖాముఖీ పోట్లాడుకుంటే ఇద్దరి మధ్యా ఇంత రగడ పెరిగేదికాదు— అలా ఎప్పుడూ తారసిల్ల లేదు సరికదా మాలతి అయినా ఒక్కసారి అతన్ని లేడీస్‌రూముకు పిలిపించి పీవాట్లు వేద్దామని అనుకో లేదు— అతను ఒక్కడే ఉన్నాడనితెలిస్తే ఆ ఛాయలకే వెళ్ళటం మానుకునేది. దామోదరమూ అంతే— మాలతి నలుగురిలోనూ ఉన్నప్పుడే అన్ని వెక్కిరింపులూ వేసేవాడుగాని ఆమె ఒంటరిగా వెళుతూంటే అతనూ ఆమెను తప్పుకుని పోయేవాడు; దూరదూరంగా తిరిగేవాడు.

(మిగతా 30 వ పేజీలో)



# ★ నారీ హృదయం ★

(17 వ పేజీ తరువాయి)

ఇక వారం రోజుల్లో కాలేజీ మూసేస్తారని— మాలతీ నేనూ మా దగ్గరవున్న లైబ్రరీ పుస్తకాలన్నీ ఇచ్చేసి కొత్తపుస్తకాలు తీసుకుందామని లైబ్రరీ రూముకు వెళ్ళాం. అప్పటికే అక్కడ కిటికీదగ్గర నిలుచుని దామోదరం అతని మిత్రబృందం పుస్తకాలు తీసుకుంటున్నారు...మాలతే చొరవచేసుకుని కిటికీ దగ్గరికివెళ్ళి పుస్తకాలన్నీ లైబ్రేరియన్‌కుఇచ్చింది. కొత్తగా వచ్చిన నవలలేవైనా ఉంటే ఇవ్వమని లైబ్రేరియన్‌ను అడిగింది. అది విని దామోదరం—

"నవలలు కావాలట నవలలు— మహా చదివే వాళ్ళకూ చెల్లదూ!" అన్నాడు.

"అనవసరమయిన విషయాల్లో జోక్యం కలిగించుకుంటే ఫలితం అనుభవిస్తారు" అన్నది మాలతి.

"ఏం చేస్తారేమిటి—చాటుమాటుగా సిరా చిలకరిస్తారు. అంతేగా! అంతకంటే ధైర్యం లేదని మాకూ తెలుసులే" అన్నాడు దామోదరం.

"దామోదరం! నీ వ్యవహారం మరీ శ్రుతిమించి రాగాన పడుతోంది...ఇన్నాళ్ళూ పోనీకదా అని ఊరుకున్నాను... నువ్వు కొంచెం జాగ్రత్తగా మసులుకోవటం మంచిది" అన్నది మాలతి తీవ్రంగానే.

"పోనీక ఏం చేస్తావేం?...చాటుగా నుంచుని నిరికి దానిలా వెనకనుంచి సిరాచల్లటం కాదు... సిరదనిత! బయలుదేరింది!... ఈమొహానికితోడు నవలలు కావాలట నవలలు—"

"అబ్బే!...నా మొహానికి నవలలు అక్కర్లేదేమో కాని నీచెంపకు దెబ్బలుమాత్రం కావాలి...రాస్కెల్."—దామోదరం చెంపమీద ఈడ్చి కొట్టింది మాలతి... ఆ క్షణంలో కోపంతో తన్ను తానే మరిచిపోయింది ఆమె...చరచరా అక్కడనుంచి లేడీస్‌రూముకు వెళ్ళిపోయింది...అక్కడ వున్నవాళ్ళందరూ ఆశ్చర్యపోయి చూస్తూ ఊరుకున్నారు... నేను మాత్రం మాలతి చేసిన పనికి చాలా సంతోషించాను...ఆమె కోసం రూముకు వెళ్ళి చూశాను... కాని మాలతిని చూసే సరికి ఆశ్చర్యమేసింది— ముఖమంతా ఎర్రబడి కందగడ్డలా తయారయింది. కళ్ళు వాచిపోయి ఎర్రగా జ్యోతుల్లా ఉన్నాయి. బల్లమీద పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఏడుపెందుకు మాలతీ! మంచిపనే చేశావుగా! ఇకనైనా బుద్ధిగా మసులుకుంటాడులే... బాగా బుద్ధిచెప్పావు" అన్నాను నేను.

"లేదు సావిత్రీ!— చాలా పొరపాటు చేశాను... ఏమిటో ఆ క్షణంలో ఆవేశం పట్టలేకపోయాను" అన్నది మాలతి.!

మాలతిని ఓదార్చటం మా కెవరికీ చేతకాలేదు... ఆ రోజంతా ఆమె మామూలు స్థితికి రాలేదు...తరువాత కూడా మాలతిలో ఇదివర కున్నంత ఉత్సాహం కనబడలేదు. కాలేజీకి వచ్చినా మా అందరితోనూ ముభావంగా ఉండేది... దామోదరంమాత్రం ఏమీ జరగనట్టుగానే స్నేహితులందరితోనూ కులాసాగా ఖుషీగా ప్రవర్తిస్తున్నాడు...తరువాత వారం రోజులకే వేసంగి సెలవులకు కాలేజీ మూసేశారు.

* * *

సెలవులయి మళ్ళీ కాలేజీ తెరవగానే ఒక్కసారిగా కాలేజీ అంతటా ఈ వార్త గుప్పుమంది... కాలేజీలో అందరూ విడ్డూరంగా చెప్పుకుంటున్నారు—

"సెలవుల్లో మాలతికీ, దామోదరానికీ పెళ్ళి అయిందనీ ఆ రోజున ఇద్దరూ నూతన దంపతులుగా కాలేజీకి వస్తారనీ."—

"ఇహ మాలతి కనుసన్నలలో మెలుగుతాడు కాబోలు దామోదరం!...నా ఎదుట దామోదరం అంటే విముఖత చూపిన మాలతేనా ఈనాడు అతని సహధర్మచారిణి అయింది!" అని నేనూ ఆశ్చర్యపోయాను—

అప్పుడు తెలిసింది నాకు—ఆ రోజున ఎందుకంత ఏడిచిందో!... మాలతితో అన్నాళ్ళు స్నేహం చేసినా ఆమెని గాఢ మనస్తత్వాన్ని అర్థం చేసుకోలేకపోయాను—ఆ మాట కొస్తే ఆమె మనస్సులో ఉద్దేశం అప్పటికి ఆమెకే స్పష్టంగా తెలియదేమో!—

సిద్ధహస్తుడయిన ఒక మహాకవి రచించిన కావ్యం ప్రతి ఘట్టంలోనూ నిశితల హృదయాలను ఉర్రూతలూగించినట్లు అడుగడుగునా చోటివారికి విస్మయం కలిగిస్తుంది మాలతి విచిత్ర ప్రకృతి! ★

## అందాకా....

మర్యాద అంటే ఏమిటి నాన్నా?" అని అడిగాడు కొడుకు తండ్రిని.

"మర్యాద అంటేనా— నీ యజమాని "ఏమిటి దీని అర్థం?" అని నిన్ను అడిగేవరకు నువ్వు నీ కున్నదని అనుకోనేది" అన్నాడు తండ్రి.

